సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



ఫాజుల్‌నగర్‌కు ఎల్లంపల్లి జలాలు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లోని రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి జలాలు చేరుకున్నాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పూజలు చేశారు. రైతుల కోరిక మేరకు వేసవికి ముందే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం పడావు పడ్డ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామన్నారు. లొంకచెరువు, ఆశిరెడ్డిపల్లి కొత్తచెరువు, సనుగుల ఎర్రచెరువు, పటేల్ చెరువులను అనుసంధానించి నీటిని నింపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్‌గౌడ్, నాయకులు సోయినేని కరుణాకర్, సంగ స్వామి, తిరుపతి, పర్శరాం, జాగిరి సురేష్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎల్‌ఎండీకి నీటి విడుదల



ఎల్‌ఎండీకి వెళ్తున్న నీరు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్‌ఎండీకి ఆదివారం 2500 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 428 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. నీటి మట్టం 22.51 టీఎంసీలకు చేరింది.

అనాథ పిల్లలకు అండగా...

- ఉమెన్స్ ఎడ్యుకేషన్, సేఫ్టీ ఫౌండేషన్ చేయూత



అనాథ పిల్లలతో ఉమెన్స్ ఎడ్యుకేషన్, సేఫ్టీ ఫౌండేషన్ ప్రతినిధులు

సిరిసిల్ల: జిల్లాలోని అనాథ పిల్లలకు ఉమెన్స్ ఎడ్యుకేషన్ అండ్ సేఫ్టీ ఫౌండేషన్ అండగా నిలుస్తోంది. అనాథ పిల్లల చదువులకు అవసరమైన పుస్తకాలు, నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లు ఇతర వస్తువులను ఆదివారం అందించింది. పేదలకు నిత్యావసర వస్తువులను అందిస్తోంది. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సౌమ్య అకాడమీ ద్వారా ముందుకు సాగుతున్నట్లు సంస్థ అధ్యక్షుడు బూర వేణు తెలిపారు. డి.కవిత, బి.నిఖిత, డి.ఆశ, కె.ఇందు, బి.చందన, బి.యోగానంద్, ఎస్.నందీశ్, డి.స్నేహ, బి.కావ్య, ఉత్తర, తనూషరెడ్డి, వైష్ణవి పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో మాస్టర్ అథ్లెట్స్ హవా



గోల్డ్ మెడల్ అందుకుంటున్న లక్ష్మి

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట: జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన మాస్టర్ అథ్లెట్స్ హవా చాటుతున్నారు. కేరళలోని త్రిచూర్‌లో జరుగుతున్న పోటీలలో ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో లావణ్య కాంస్యం, 200 మీటర్ల రన్నింగ్‌లో లక్ష్మి బంగారు పతకాలు సాధించారు. అరవై ఏళ్ల వయసులో లక్ష్మి రన్నింగ్‌లో పతకం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీందర్‌రెడ్డి, అధ్యక్షుడు సంగ స్వామి అభినందించారు.

అధికారులు మానవత్వాన్ని చాటారు

- సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సంతోష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో జిల్లా అధికారులు మానవత్వాన్ని చాటారని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అభినందించారు. ముస్తాబాద్‌లో అనారోగ్యంతో మృతిచెందిన నేత కార్మికుడు బిట్ల సంతోష్ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేత కుటుంబం పరిస్థితిని తెలుసుకొని జిల్లా కలెక్టర్ 24 గంటల్లోనే వారికి ప్రభుత్వ ఇంటిని మంజూరు చేసి మానవత్వాన్ని చాటుకున్నారని అభినందించారు. సమాజంలో జరుగుతున్న ఇలాంటి సంఘటనలపై ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ దిక్కులేని నేతకార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు, మీడియా మిత్రులనూ అభినందించారు. పార్లమెంటు ఎన్నికల కో–కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, రాంరెడ్డి, ఎలుసాని దేవయ్య, విజయ్‌రెడ్డి, శీల ప్రశాంత్, భాను, షాదుల్, కొండల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నామినేషన్లకు వేళాయే..!

- ఈ నెల 7న నామినేషన్ వేయనున్న నరేందర్‌రెడ్డి
- తొలిరోజు నామినేషన్‌కు రవీందర్‌సింగ్ సన్నాహాలు
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని బీఆర్‌ఎస్
- 'గులాబీ' ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ?



నరేందర్‌రెడ్డి



అంజిరెడ్డి



కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించే కార్యాలయం



సర్దార్ రవీందర్‌సింగ్



కూర రఘోత్తమరెడ్డి



అశోక్‌కుమార్



మల్క కొమురయ్య

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్సీ నామినేషన్లకు రంగం సిద్ధమైంది. కరీంనగర్ కేంద్రంగా జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కలెక్టర్ పమేలా సత్పతి ఆర్‌వోగా వ్యవహరిస్తారు. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ సోమవారం వెలువడనుంది. నేటి నుంచి పదో తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11న స్క్రూటినీ, 13వరకు నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ మేరకు 15 జిల్లాలు, 42 నియోజకవర్గాలు ఎన్నికల కోడ్‌లోకి వచ్చాయి. ఆయా ప్రాంతాల నుంచి పలువురు నేతలు నామినేషన్ వేసేందుకు కరీంనగర్ రానున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేతల ఏర్పాట్లు..

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంతో ఆయన ఈనెల 7న నామినేషన్ వేస్తారని సమాచారం. ఆ రోజు ఆయన కుటుంబసభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారని తెలిసింది. పదో తేదీన నిర్వహించే మరో ర్యాలీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. మరో అభ్యర్థి ప్రసన్న హరికృష్ణతో బీఆర్‌ఎస్ నేతలు మంతనాలు సాగిస్తున్నారని సమాచారం. ఆయన గులాబీ పార్టీలో చేరతారా? లేక స్వతంత్రంగా బరిలో ఉంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

స్వతంత్రులుగా పలువురు

డా.బీఎస్.రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు స్వతంత్రులుగా బరిలో ఉంటారని సమాచారం. వీరిలో రవీందర్‌సింగ్, శేఖర్‌రావు ఉద్యమనాయకులు. అయినా తమకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా ఉద్యమనేత నిజామాబాద్‌కు చెందిన రాజారాంయాదవ్‌కు కూడా ఈ విషయంలో నిరాశ మిగిలింది. బీజేపీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ అభ్యర్థి మల్క కొమురయ్య నామినేషన్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరి నామినేషన్లకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితోపాటు మరికొందరు కీలక నేతలు హాజరవుతారు. ప్రభుత్వ అధ్యాపక జేఏసీ, ఎస్టీయూ టీఎస్, టీపీఆర్టీయూ బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి, సిట్టింగ్ టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి కూడా రెండురోజుల్లో నామినేషన్ వేయనున్నారు. మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నా.. బరిలో దిగే విషయంలో సందిగ్ధం నెలకొంది. అలాగే పీఆర్‌టీయూ బలపరిచిన వంగా మహేందర్‌రెడ్డి, ఎస్టీయూ నుంచి సంకినేని మాధవరావు కూడా బరిలో ఉన్నారు. టీపీటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన వై.అశోక్‌కుమార్ నామినేషన్‌కు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరి భవితవ్యాన్ని 3,58,614 మంది గ్రాడ్యుయేట్లు, 28,672 మంది టీచర్లు నిర్ణయించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

ఈనెల 3న	నోటిఫికేషన్ విడుదల
10న	నామినేషన్ల చివరితేదీ
11న	నామినేషన్ల స్క్రూటినీ
13న	విత్‌డ్రాలకు చివరితేదీ
27న	పోలింగ్
మార్చి 3న	ఓట్ల లెక్కింపు
08న	ఎన్నికల ప్రక్రియ పూర్తి

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్ అర్బన్: నామినేషన్లను దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థుల సహాయార్థం కరీంనగర్ కలెక్టరేట్ ప్రధాన ద్వారంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ స్థాయి అధికారులు సేవలు అందించనున్నారు. కలెక్టరేట్ చిరునామా తెలిపేలా బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు బోర్డులను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

- రాజన్న ఆలయ విస్తరణకు ప్రణాళికలు
- త్వరలోనే విస్తరణ పనులు షురూ
- వెయ్యి ఏళ్ల ప్రణాళికతో ముందుకు..
- మే నెలలో శృంగేరి పీఠాధిపతులు రాక



వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్న ఆలయానికి మహర్దశ పట్టనుంది. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వెయ్యి ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పనులు చేయాలనుకుంటున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూత్రప్రాయంగా వెల్లడించారు. భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా రాజన్నను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ధర్మగుండం ప్రాశస్త్యాన్ని కాపాడుకుంటూనే మరో ధర్మగుండం ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ప్రసాదాల కౌంటర్లు, నిత్య అన్నదానం, వసతిగదులు నిర్మించనున్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తికానుంది.

భీమన్న గుడిలో దర్శనం

రాజన్న గుడి విస్తరణ పనులు ప్రారంభిస్తే భక్తులకు దర్శనాలను భీమన్నగుడిలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది. సాధ్యాసాధ్యాలను త్వరలోనే అధికారులు పరిశీలించనున్నారు. ఇందుకు భీమన్నగుడిని భక్తులకు సౌకర్యంగా మార్చనున్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ముగిసిన తర్వాత ఆలయ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు సమాచారం. మే నెలలో శృంగేరి పీఠాధిపతుల బృందం ఆలయాన్ని పరిశీలించనున్నారు. వారి సూచనల మేరకు విస్తరణ పనులు చేపట్టనున్నారు.

సంక్షేమానికి నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల: కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలని, సంక్షేమానికి నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీఐటీయూ నాయకులు ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ విమర్శించారు. గత బడ్జెట్ కంటే రూ.3లక్షల కోట్లు అదనంగా కేటాయింపులతో ప్రవేశపెట్టినా.. జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. బడ్జెట్‌ను సవరించి సంక్షేమానికి ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, సూరం పద్మ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, ఒగ్గు గణేశ్, జిందం కమలాకర్, బత్తుల రమేశ్, గడ్డం రాజశేఖర్, జగదీశ్, దేవరాజు, ఇస్తారి, రాజు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



పరిచయం చేసుకుంటున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని నాయకులు కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువకేంద్రం, జైభారత్ ఆధ్వర్యంలో ఆదివారం కబడ్డీ, వాలీబాల్ టోర్నీలను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నేరెళ్ల రమేశ్ ప్రారంభించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని కోరారు. బీజేపీ జిల్లా కమిటీ సభ్యుడు పొంచెట్టి రాకేశ్, మేడిశెట్టి శ్రీహరి, గొల్లపల్లి రాంబాబు, నక్క రవి, గుగ్గిల్ల సాగర్, వెంగల వెంకటేశ్, మేడిపల్లి మనోజ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జీ(వి)తాలు గాడిలో పడేనా!



ఇతను కత్తెరపాక రాజయ్య. వీర్నపల్లి గ్రామపంచాయతీలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్(ఎంపీడబ్ల్యూ). గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లను శుభ్రం చేస్తూ.. చెత్తను ఎత్తిపోస్తూ.. పంచాయతీ అధికారులు ఏ పని చెబితే.. ఆ పని చేసినా.. ప్రతీ నెల జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా జీతాలు రాలేదని, కుటుంబ పోషణ భారంగా మారిందని రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడిన చేతిలో చిల్లి గవ్వలేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. రోజంతా శ్రమించినా జీతాలు సకాలంలో అందక రాజయ్య లాంటి మల్టీపర్పస్ వర్కర్లు అనేక పల్లెల్లో ఇబ్బందులకు గురవుతున్నారు.



గ్రామపంచాయతీ భవనం



ఈ చిత్రంలో కుక్క కళేబరాన్ని తొలగిస్తుంది జిల్లాలోని ఓ మారుమూల పల్లెలోని మల్టీపర్పస్ వర్కర్. గ్రామ పంచాయతీలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లు అన్ని పనులు చేయాల్సిందే. పంపు ఆపరేటర్ నుంచి ట్రాక్టర్ నడిపే వరకు.. డ్రెయినేజీలో చెత్త తొలగించడం నుంచి వాటర్‌ట్యాంక్‌లు శుభ్రం చేసే పని వరకు అన్నీ చేస్తున్నారు. ఇలా గ్రామాల్లో ఏ పని అయినా మల్టీపర్పస్ వర్కర్లే చేస్తున్నారు.

- దుర్భరంగా మల్టీపర్పస్ వర్కర్ల జీవితాలు
- ఇన్నాళ్లు అధికారుల దయాదాక్షిణ్యాలపైనే జీతాలు
- ఇక నేరుగా అందనున్న వేతనాలు
- వ్యక్తిగత బ్యాంకు ఖాతాల వివరాలు సేకరణ



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వర్కర్

గ్రామాల స్వరూపం

గ్రామపంచాయతీలు	: 260
ఎంపీడబ్ల్యూఎస్ సిబ్బంది	: 1237
ప్రతీ నెల అందించే వేతనం	: రూ.9500 ఒక్కొక్కరికి

సిరిసిల్ల: మల్టీపర్పస్ వర్కర్లు బండ చాకిరీ చేస్తున్నా ప్రతీ నెల వేతనాలు అందడం లేదు. అది కూడా ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీతాలు వస్తున్నాయి. గ్రామాల్లో అన్ని పనులు తామై చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు వచ్చే చాలీచాలని వేతనాలు సైతం సకాలంలో అందడం లేదు. గతంలో గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతితోనే జీతాలు అందేవి. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండడంతో అధికారులు దయతలిస్తేనే మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు అందుతున్నాయి. ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, గ్రామాల్లో ఇతర అవసరాలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్(ఎస్‌ఎఫ్‌సీ) ద్వారా నిధులు మంజూరు చేస్తుంది. ఈ నిధులను అప్పట్లో సర్పంచ్‌లు, అధికారులు ఇతర అవసరాలకు వాడుకుని ఎంపీడబ్ల్యూల వేతనాలను ఇష్టానుసారంగా అందించే వారు. ఇప్పుడు కూడా కొన్ని గ్రామాల్లో ప్రతి నెలా వేతనం రూ.9500 చెల్లిస్తుండగా.. కొన్ని గ్రామాల్లో సరిగ్గా ఇవ్వడం లేదు. దీంతో పనులు చేసేందుకు సిబ్బంది ఆసక్తి చూపకపోవడం, చేసినా మొక్కుబడిగా చేయడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎంపీడబ్ల్యూఎస్‌లకు నేరుగా వేతనాలు

క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వాలని భావిస్తోంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారుల ద్వారా ఎంపీడబ్ల్యూఎస్‌ల బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఐఎఫ్‌ఎస్‌సీ నంబర్లు సేకరిస్తుంది. ఫలితంగా రాబోయే ఒకటి, రెండు నెలల్లో పూర్తి స్థాయిలో ప్రభుత్వం నేరుగా ఎంపీడబ్ల్యూలకు వేతనాలు అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఇది పూర్తయితే.. ఎంపీడబ్ల్యూఎస్‌లకు నేరుగా వేతనాలు అందనున్నాయి.

నేరుగా ఇస్తే చాలా సంతోషం



గ్రామాల్లో అన్ని రకాల పనులు చేసే మల్టీపర్పస్ వర్కర్లకు నేరుగా వేతనాలు ఇస్తే చాలా సంతోషం. అసలే అరకొర వేతనాలు.. అవి కూడా నెలనెలా రాకుంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. నాకు డిసెంబరు నెల వరకు వచ్చింది. ప్రభుత్వం నేరుగా జీతాలు ఇచ్చేందుకు మా బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకోవడం ఆనందంగా ఉంది.

– రాణవేణి బాలకృష్ణ, మల్టీపర్పస్ వర్కర్, రుద్రంగి


ఏళ్లుగా పోరాడుతున్నాం



గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు, ఇతర మల్టీపర్పస్ వర్కర్లు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీల ఆర్థికస్థితిని బట్టి జీతాలు ఇస్తున్నారు. ప్రభుత్వం ద్వారా నిధులు వస్తేనే కొన్ని గ్రామాల్లో వేతనాలు ఇస్తుండగా.. కొన్ని గ్రామాల్లో గ్రాంటుతో సంబంధం లేకుండా జీతాలు ఇస్తున్నారు. ప్రభుత్వం నేరుగా వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం మంచి పరిణామం.

– అన్నల్‌దాస్ గణేశ్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లా నుంచి వివరాలు అందించాం



జిల్లాలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్ల బ్యాంకు ఖాతానంబర్లు, ఇతర వివరాలను ఉన్నతాధికారులు అడిగారు. అధికారులు అడిగిన సమాచారాన్ని అందించాం. గ్రామాల్లో పనిచేసే సిబ్బందికి నేరుగా వేతనాలు ఇచ్చే లక్ష్యంతోనే సమగ్ర సమాచారాన్ని సేకరించి పంపించాం. ఎప్పటి నుంచి అమలు జరుగుతుందో మాకు సమాచారం లేదు.

– శేషాద్రి, ఇన్‌చార్జి డీపీవో

గంగమ్మతల్లికి పూజలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో గంగపుత్రులు ఆదివారం గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లెప్రకృతివనంలోని గంగమ్మతల్లి విగ్రహానికి పూజలు చేశారు. ప్రతీ మాఘమాసంలో గంగమ్మతల్లికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పెంటం పద్మయ్య, సభ్యులు నాగేశ్వర్, మైసయ్య, ప్రవీణ్‌కుమార్, పెంటం శ్రీనివాస్, పెంటం కిషన్, ఎల్లయ్య, శైలేందర్, దేవదాస్, సుధాకర్, అమర్‌నాథ్, భూమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

చేనేత కళాకారుడు హరిప్రసాద్‌కు డాక్టరేట్



సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హరిప్రసాద్‌కు డాక్టరేట్ అందించారు. చేనేత కళారంగంలో బుల్లి మరమగ్గాలు, రాట్నం, అగ్గిపెట్టెలో ఇమిడే చీర, వెండి, బంగారం పోగులతో చీరల తయారీ, జీ20 లోగోను తయారు చేశారు. ప్రముఖుల చిత్రాలు చేనేతమగ్గంపై నేసి దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్‌లో హరిప్రసాద్ ప్రశంసలు అందుకున్నారు. అంతకుముందు నేత చిత్రాలతో న్యూజిలాండ్ ప్రధాని ప్రశంసలు పొందారు. తన కళా నైపుణ్యానికి గుర్తింపుగా డాక్టరేట్ అందుకున్నారు.

5న ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ ఆవిర్భావ వేడుక

వేములవాడ: ఈనెల 5న ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ ఆవిర్భావ వేడుకలను వేములవాడలో నిర్వహిస్తున్నట్లు కళాకారుల బృందం ఆదివారం ప్రకటించింది. ఐటీఎఫ్ స్థాపించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వేములవాడ బద్దిపోచమ్మకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూట్యూబ్ మహిళ స్టార్‌లతో బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు


చిన్నారి కాలికి గాయం

కోనరావుపేట(వేములవాడ): పల్లిమక్తలో కోతుల దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చిన్నారి గడ్డమీది శ్రీలేఖ్య(6) ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. చెట్టుపై ఉన్న కోతి ఒక్కసారిగా వచ్చి దాడి చేసింది. చిన్నారి కాలికి గాయమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు.

అప్పుల బాధతో బలవన్మరణం

కథలాపూర్(కోరుట్ల): కథలాపూర్ మండలం కలిగోట గ్రామానికి చెందిన లక్కం పెద్దగంగారాం(47) అనే వ్యక్తి అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పెద్దగంగారాం రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. ఆసుపత్రుల్లో వైద్యం కోసం అప్పులు చేయడం.. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన పెద్దగంగారాం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకున్నట్లు గ్రామస్తులు ఆదివారం గుర్తించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు

గోదావరిఖని: పోలీస్ వెరిఫికేషన్ కోసం తప్పుడు అఫిడవిట్ సమర్పించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. స్థానిక లెనిన్‌నగర్‌కు చెందిన వనపాకల విజయ్ ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్‌తో పోలీస్ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీనిపై దర్యాప్తు చేయగా.. ఐదు క్రిమినల్ కేసులున్నట్లు తేలిందని అన్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సూచన మేరకు విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

లక్కీ భాస్కర్ రమేశ్ వెనుక గాడ్ ఫాదర్!

- సీఐడీ క్రిప్టో దర్యాప్తుపై నీలినీడలు
- నిందితుడితో సీఐడీ అధికారుల రహస్య సమావేశాలు
- వీడియోలతో డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదు చేసిన బాధితులు
- బాధితుల ఫిర్యాదుతో కరీంనగర్ డీఎస్పీపై వేటు
- రమేశ్ భార్య, డ్రైవర్లను ఇంతవరకూ అరెస్ట్ చేయని సీఐడీ
- దాడులకు ముందే సీఐడీ నుంచి రమేశ్ కుటుంబానికి ఫోన్లు?


కారులో సమావేశమైన రమేశ్‌గౌడ్(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇటీవల విడుదలైన లక్కీభాస్కర్ సినిమాలో మాదిరిగా క్రిప్టో కరెన్సీ పేరుతో దాదాపు రూ.100 కోట్ల వరకు వసూలు చేసి దుబాయ్ పారిపోదామనుకున్న రమేశ్‌గౌడ్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జీబీఆర్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరుతో వసూలు చేసిన డబ్బులతో అయన సీఐడీ



దర్యాప్తు అధికారులను ప్రభావితం చేస్తున్నారా..? అతడిని రక్షించేందుకు తెరవెనుక గాడ్‌ఫాదర్ ఎవరైనా ఉన్నారా..? అతని ఇంటి మీద జరిగే దాడుల సమాచారం ముందే లీకైందా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. అతడి అరెస్టు సమయంలో సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోకపోవడం.. కేసు నెమ్మదిగా సాగుతుండటంపై బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే వారు కేవలం ఆరోపణలకే పరిమితం కాలేదు. దర్యాప్తు అధికారులను రమేశ్ తన వశం చేసుకున్నాడని పలు వీడియోలు, ఫొటోలు, ఆడియోరికార్డింగులు సంపాదించి డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఇక్కడ దర్యాప్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయడం బాధితుల ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది.

వారి సంగతేమిటి..?

సీఐడీ ఎఫ్ఐఆర్‌లో నిందితుడు రమేశ్‌తోపాటు అతని భార్య ఉమారాణి, డ్రైవర్ సురేష్ పేర్లు కూడా నిందితుల జాబితాలో ఉన్నాయి. రమేశ్‌గౌడ్ బాధితుల నుంచి సేకరించిన డబ్బును వీరి ఖాతాల్లోకి మళ్లించినట్లు సీఐడీ విభాగం గుర్తించినా ఇంతవరకు అదుపులోకి తీసుకోకపోవడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అలాగే నిందితుడు రమేశ్‌గౌడ్ అరెస్టయిన రోజు అతని మూడు యాపిల్ సెల్‌ఫోన్లను తన డ్రైవర్‌కు అప్పగించి పంపించడంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడి ఆర్థిక లావాదేవీలన్నీ ఆ మూడు సెల్‌ఫోన్లలోనే ఉన్నాయని తెలిసినప్పటికీ వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని నిలదీస్తున్నారు. సీఐడీ అధికారులు రమేశ్‌గౌడ్‌పై దాడులు చేసేందుకు వెళ్లే సమాచారం ముందే లీకైందని ఆరోపిస్తున్నారు. మొత్తం సీఐడీ దర్యాప్తు సాగుతున్న తీరు చూస్తుంటే తమకు న్యాయం దక్కదేమోనని బాధితులు వాపోతున్నారు. ఈ కేసులో మన రాష్ట్రం నుంచి హవాలా మార్గంలో రూ.కోట్ల డబ్బు దుబాయికి చేరిందనే విషయం తెలిసిందే. ఈ క్రమంలో మనీల్యాండరింగ్ జరిగిందని, నిర్ధారణ అయ్యిందని ఈ నేపథ్యంలో కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐకి అప్పగించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

నిందితుడితో సీఐడీ అధికారుల సమావేశాలు?

జీబీఆర్ క్రిప్టో కరెన్సీ పేరిట అమాయకుల నుంచి కోట్లు వసూలు చేసిన జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ వ్యవహారం కొత్త చర్చకు దారి తీస్తోంది. సీఐడీ అధికారులతో తాను ముందే మాట్లాడుకున్నానని, వారు తనను ఏం చేయలేరని బాధితులతో గొప్పలు చెప్పుకున్నాడు. ఈ వ్యవహారంలో సీఐడీ విచారణ నెమ్మదించడం.. అక్టోబర్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనా అతనిపై చర్యలు తీసుకోకపోవడంతో వారి అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో వారు రమేశ్‌గౌడ్ ప్రతి కదలికను వీడియో రికార్డు చేశారు. సీఐడీ పోలీసులు, నిందితుడు రమేశ్‌గౌడ్‌తో డబ్బుల వ్యవహారంపై చర్చించిన మాటలు రికార్డు చేశారు. ఈ క్రమంలోనే రమేశ్‌గౌడ్ సీఐడీ అధికారులతో హైదరాబాద్, వరంగల్‌లో పలుమార్లు రహస్యంగా సమావేశమైనట్లు తెలుసుకున్నారు. కరీంనగర్ శివారులోని రేకుర్తిలో కరీంనగర్ సీఐడీ అఫీసుకు చెందిన ఓ ఉన్నతాధికారి వాహనంలో రమేశ్‌గౌడ్, అతని బావ అయిన ఓ కానిస్టేబుల్, రమేశ్‌గౌడ్ రియల్ ఎస్టేట్ పార్టనర్‌లు కలిసి సమావేశమయ్యారు. ఈ వ్యవహారాన్ని మొత్తం రహస్యంగా వీడియో చిత్రీకరించిన బాధితులు సదరు అడియో, వీడియో క్లిప్పింగ్‌లను డీజీపీ కార్యాలయంలోని సీఐడీ విభాగానికి అందించారు. రమేశ్‌గౌడ్, అతని మనుషులు సీఐడీ దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారని, అతడితో పలుమార్లు సీఐడీ అధికారులు సమావేశమవ్వడమే అందుకు నిదర్శనం అంటూ సదరు వీడియోలను చూపించారు. ఈ నేపథ్యంలోనే గతనెల 29న కరీంనగర్ సీఐడీ డీఎస్పీని అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎమ్మెల్సీగా గెలిచి హైకమాండ్‌కు గిఫ్ట్ ఇస్తా

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఎమ్మెల్సీగా తన గెలుపుతో పార్టీ అధిష్టానానికి బహుమతి అందిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ విజయం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు బాట వేయాల్సి ఉందన్నారు. ఆదివారం నగరంలోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించినందుకు కాంగ్రెస్ అధిష్టానం, సహకరించిన సీఎం, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రులు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రులకు సేవకుడిగా పని చేస్తానన్నారు. ఈనెల 7న ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నామని, తరువాత 10న భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు, పార్టీ పెద్దలు పాల్గొంటారన్నారు. సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, కాశెట్టి శ్రీనివాస్, మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

చొప్పదండి: తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రులకు చేదోడువాదోడుగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కర్ర సత్యప్రసన్నారెడ్డి, గుర్రం భూమారెడ్డి, చిలుక రవీందర్, గుర్రం రాజేందర్‌రెడ్డి, గుర్రం హన్మంతరెడ్డి, కేతిరెడ్డి మణిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సెక్యూరిటీ గార్డుపై దాడికి యత్నం?

రామగిరి(మంథని): ఆర్జీ–3 ఏరియాలోని సింగరేణి సెక్యూరిటీ గార్డు(ఎస్అండ్‌పీసీ)పై ఏరియాలోని ఓ ప్రైవేట్ ఓబీ కంపెనీ మేనేజర్ దాడికి యత్నించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఆర్జీ–3 ఏరియాలోని సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి రోజూవారీలాగే ఆదివారం డ్యూటీలు వేశారు. మొదటి షిఫ్ట్‌లో ఎన్‌టీఎక్స్ వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డు అక్కడికొచ్చిన ప్రయివేట్ ఓబీ కంపెనీ మేనేజర్‌ను గేట్ పాస్ అడిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన మేనేజర్ నన్ను గేట్ పాస్ అడుగుతావా అంటూ సెక్యూరిటీ రూంలో ఉన్న ఫైళ్లను చిందరవందరగా పడేసి సెక్యూరిటీ గార్డును బూతులు తిట్టాడు. సెక్యూరిటీ గదిలో ఉన్న కుర్చీలను విరగొట్టాడు. సెక్యూరిటీ గార్డుగా ఎలా విధులు నిర్వహిస్తావో చూస్తానని, ఉన్నతాధికారులకు చెప్పి డ్యూటీ లేకుండా చేస్తానని బెదిరింపులకు పాల్పడటంతో.. సదరు సెక్యూరిటీ గార్డు తోటి సిబ్బందికి తెలియజేశారు. సెక్యూరిటీ గార్డులపై దాడులు పునరావృతం కాకుండా ఏరియా సెక్యూరిటీ గార్డులందరూ సోమవారం ఏరియా సెక్యూరిటీ అధికారికి ఫిర్యాదు చేయనున్నారు. ఏరియా అధికారి షబ్బీరుద్దీన్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా.. అందుబాటులోకి రాలేదు.


కుర్చీ ధ్వంసం, చిందరవందరగా ఫైళ్లు

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ రాజం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద ఆదివారం ఆటో బోల్తా పడగా.. ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. వివరాలు.. బండలింగంపల్లికి చెందిన సూరోజు రాజం అనే వ్యక్తి ఆటోలో రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా.. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా, అతివేగంగా ఆటోను నడపడంతో బోల్తా పడింది. రాజం చెవికి గాయమై పక్కటెముకలు విరగడంతో పరిస్థితి విషమంగా మారింది. మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి


మాట్లాడుతున్న రఘోత్తమరెడ్డి

కరీంనగర్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని, మరోసారి ఎమ్మెల్సీగా అవకాశమిచ్చి ఆశీర్వదించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ప్రభుత్వ అధ్యాపక జేఏసీ, ఎస్టీయూ టీఎస్, టీపీఆర్టీయూ సంఘాల ఆధ్వర్యంలో సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి అభ్యర్థిగా మరోసారి టీచర్ ఎమ్మెల్సీగా బరిలో ఉన్నానని అన్నారు. అధ్యాపక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందంగౌడ్, టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ.. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ అయిన కూర రఘోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వివిధ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు రఘోత్తమరెడ్డికి మద్దతు పలికారు. పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రచారి, పాతూరి రాజిరెడ్డి, గోనే శ్రీనివాస్, శనిగరపు రవి, కనకయ్య పాల్గొన్నారు.

కడుపు కోత మిగిల్చిన ఈత సరదా

- చెరువులో బాలుడి మృతి


వెంకటసాయి(ఫైల్)

హుజూరాబాద్: ఊరి చెరువు ఓ తల్లికి కడుపు కోతను మిగిల్చింది. అప్పటివరకు కుటుంబ సభ్యులతో గడిపిన బాలుడు అంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయాడు. ఆదివారం ఈతకు వెళ్లిన బాలుడు నీటమునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన మచ్చ రాజు–భారతి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కూమారుడు వెంకటసాయి(13) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. పాఠశాలకు ఆదివారం సెలవు కావడంతో తమ్ముడు మణిదీప్‌తోపాటు నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న అంకుశవలి కుంటలో ఈత కొట్టడానికి వెళ్లాడు. చెరువులో దిగిన వెంకటసాయికు ఈత సరిగా రాక నీటమునిగి బయటికి రాలేదు. భయభ్రాంతులకు గురైన సోదరుడు మణిదీప్, మిగతా స్నేహితులు ఇంటికొచ్చి నానమ్మ సరోజనకు తెలిపారు. స్థానికులతో కలిసి చెరువుకుంట వద్దకెళ్లిన ఈతగాళ్లు ఎంత ప్రయత్నించినా మృతదేహం లభ్యం కాకపోవడంతో పట్టణంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. నీటి అడుగున బురదలో చిక్కుకున్న సాయి మృతదేహాన్ని ఫైర్ సిబ్బంది బయటకు తీశారు. కుమారుడి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు సొమ్మసిల్లి పడిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

కారుకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఎస్సై మన్మథరావు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో రామాలయం వెనక ఆదివారం పార్కింగ్ చేసిన స్విఫ్ట్ కారును గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. పట్టణానికి చెందిన వినయ్ తన కారును ఉదయం పార్కింగ్ చేసి వెళ్లాడు. మధ్యాహ్నం కారుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వెంటనే స్థానికులు గుర్తించి మంటలార్పారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై మన్మథరావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరుపై ఆరా తీశారు. సుమారు రూ.2లక్షల నష్టం జరిగినట్లు కారు యజమాని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



భీమా శంకరా.. కాశీ విశ్వేశ్వరుడా..

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ దేవాలయాలను సందర్శించారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.







ఇక డ్రోన్ వ్యవసాయం

- రసాయన మందులూ పిచికారీ
- కొనుగోలుకు ముందుకొస్తున్న రైతులు
- అద్దెకిస్తున్న పలు కంపెనీలు
- సింగిల్‌విండో ద్వారా కొనుగోలుకు ప్రణాళిక



జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. వ్యవసాయ పనుల్లో మనిషి శ్రమను తగ్గించేందుకు యంత్ర పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చినవే డ్రోన్లు. ప్రస్తుతం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డ్రోన్లపై క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లో ప్రయోగాలు చేయడంతోపాటు పలు ప్రదర్శనల్లో డ్రోన్ స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన పెంచుతోంది. పలు కంపెనీలు పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్లను కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన రైతులకిస్తున్నారు. తాజాగా సింగిల్‌విండో సొసైటీల ద్వారా డ్రోన్లను కొనుగోలు చేసి రైతులకు అద్దెకివ్వాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.

అసలు డ్రోన్లు అంటే..

తేనెటీగ మాదిరిగా శబ్దం చేస్తూ ఎగురుతుంది. కాబట్టి డ్రోన్ అనే పేరు వచ్చింది. పైలెట్ లేకుండా పని చేసే స్వభావం ఉండటంతో మానవరహిత బుల్లి విమానం అంటారు. 400 అడుగుల ఎత్తు, 20 కి.మీ. పరిధిలో గంటపాటు నిరంతరంగా ఎగురుతుంది. మనుషులు అడుగుపెట్టని ప్రాంతానికి నిమిషాల్లో చేరుకుంటుంది. అక్కడి ఫొటోలు, వీడియోలు చిత్రీకరిస్తుంది. 20 ఏళ్ల క్రితం వరకు నిఘా కార్యకలాపాలకే పరిమితమైన డ్రోన్ నేడు ప్రతిచోట తన ఉనికి చాటుతోంది. రక్షణ, భద్రత, వైద్యం, ఆర్థికం, మైనింగ్, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, సరుకు రవాణా, పెళ్లిళ్లలో ఫొటోలు తీయడం.. ఇలా ప్రతి రంగంలోనే సేవలందిస్తోంది. కూలీల కొరత సమస్యను ఎదుర్కొంటున్న వ్యవసాయ రంగానికి డ్రోన్ ఓ దీపంలా మారింది.

విదేశాల్లో ఇప్పటికే ఉపయోగంలోకి..

అమెరికా, జపాన్ లాంటి చాలా దేశాల్లో ఇప్పటికే డ్రోన్లు వినియోగిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. పెద్దపెద్ద పొలాల్లో పంట పరిస్థితి, చీడపీడల గురించి తెలుసుకోవడానికి రైతులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలు డ్రోన్ల మీదే ఆధారపడుతున్నారు. డ్రోన్లు క్షణాల్లో వీడియో తీసి ఆ దృశ్యాలను కంప్యూటర్‌కు పంపిస్తుండటంతో.. అందులో పంట స్థితిగతులు, చీడపీడల ప్రభావం అంచనా వేసి తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. మట్టి నాణ్యత, విశ్లేషణ, వాతావరణం, పంట దిగుబడి అంచనాలకు సైతం డ్రోన్లనే వాడుతున్నారు. డ్రోన్ల వాడకంలో చైనా మొదటి స్థానంలో ఉంది.

రసాయన మందుల పిచికారీలో..

పంటకు చీడపీడలు ఆశించినప్పుడు.. తెగుళ్ల తాకిడి అధికమై పంటకు నష్టం జరుగుతున్నప్పుడు వెంటనే పురుగు మందులు పిచికారీ చేసి పంటను కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. కూలీల సమస్య అధికమవడం, వరి లాంటి బురద పంటల్లో 15 లీటర్ల మందు డబ్బాను భుజానికి వేసుకొని పిచికారీ చేయడం కష్టసాధ్యంగా మారింది. పది మంది కూలీలు చేసే పనిని డ్రోన్ ఒక్కటే చేస్తుంది. కేవలం పది నిమిషాల్లో ఎకరం పొలంలో మందు పిచికారీ చేస్తుంది. మనుషుల మాదిరిగా ఎక్కువ, తక్కువ కాకుండా పొలంలోని మొక్కలన్నింటికీ సమానంగా మందు పిచికారీ చేస్తుంది. ప్రస్తుతం 3 నుంచి 20 లీటర్ల వరకు పిచికారీ చేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. డ్రోన్లతో పిచికారీ చేయడం వల్ల నీరు, మందు, సమయం, ఖర్చు ఆదా అవుతుంది. డ్రోన్‌కు పొలం సర్వే నంబర్, జీపీఎస్, మొబైల్ యాప్‌తో అనుసంధానం చేయడంతో ఎక్కడ, ఏమేరకు పిచికారీ చేయాలో చేస్తుంది. డ్రోన్‌లో ఉండే అత్యాధునిక పరికరాలతో పొలాన్ని నిమిషంలో చుట్టేసి.. ఏ రకం తెగులు, పురుగులున్నాయో పసిగట్టే డ్రోన్లు కూడా వచ్చేశాయి. ఇవి పొలంలోని అన్ని కోణాల్లో హెచ్‌డీ నాణ్యతతో ఫొటోలు, వీడియోలు తీసి శాస్త్రవేత్తలకు పంపించే ఏర్పాట్లు కూడా ఉన్నాయి.

ప్రస్తుతం రైతుల పొలాల్లో ప్రయోగాలు

ఓవైపు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏ పంటకు, ఏమేర పురుగు మందును పిచికారీ చేయాలనే విషయంపై ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేస్తుండగా.. మరికొందరు అభ్యుదయ రైతులతోపాటు కంపెనీలు డ్రోన్లను కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన రైతుల పొలాల్లో రసాయన మందును పిచికారీ చేస్తున్నారు. అయితే ఇందులో పూర్తిస్థాయిలో ఇంకా స్పష్టత రాలేదు. రానున్న రోజుల్లో ఇంట్లోని కంప్యూటర్ నుంచే డ్రోన్ పిచికారీ చేసే పద్ధతులను పరిశీలించొచ్చు. ప్రస్తుతం డ్రోన్‌తో పిచికారీ చేసేచోట ఓ జీపీఎస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి డ్రోన్ సేవలను ఉపయోగించుకుంటున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



కొన్నిచోట్ల కంపెనీలు డ్రోన్ల ను అందిస్తున్నా.. ఎక్కువ రేట్లు వసూలు చేస్తున్నాయి. రైతులందరికీ అందుబాటులోకి డ్రోన్ వ్యవస్థను తీసుకురావాలి. డ్రోన్లపై శాస్త్రవేత్తలు మరింతగా పరిశోధనలు చేయాలి.

– వెల్ముల రాంరెడ్డి, వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు

మరింత పరిశోధనలు



డ్రోన్లను ఇప్పటికే పలు కంపెనీల ద్వారా రైతులు వాడుతున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో డ్రోన్ల ద్వారా పిచికారీ చేసే పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయి. డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తే మందు ప్రభావం ఎలా ఉందనే విషయాలపై ఇంకా పరిశోధనలు సాగుతున్నాయి.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

బస్టాండ్‌లో వ్యాపారిపై దాడి

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌లో దుకాణం నిర్వహిస్తున్న ఇంతియాజ్ అనే వ్యక్తిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆరపేటకు చెందిన బాలు, ఈశ్వర్, తరుణ్, కిషోర్ గత నెల 25న ఇంతియాజ్ వద్దకొచ్చి వాటర్ బాటిల్ తీసుకున్నారు. అది చల్లగా లేదంటూ అతడితో గొడవకు దిగారు. ఈక్రమంలో దాడికి పాల్పడగా.. అతడి ఎడమ కన్నుకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు

పట్టణంలోని వెంకట్రావ్‌పేటలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి రషీద్, కుంచెపు లింబాద్రి, కమల్‌లపై దాడికి పాల్పడ్డ బొమ్మెల మేడిపల్లికి చెందిన వంశీ, నరేందర్, మెట్‌పల్లికి చెందిన రోషన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ *రెగ్యులర్ & డిస్టెన్స్ : డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA (4 నెలల్లో పూర్తి) Dr.J.S అకాడమి (ISO 9001:2015 సర్టిఫైడ్) 8866977112 [HA-15420]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1268551]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [SCA25001467]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824